నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, గురువారం 29 ఆగస్టు 2024 | NALGONDA




లక్ష్మీతండాలో అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

## అభయాంజనేయ స్వామికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పూజలు

సూర్యాపేట రూరల్, ఆగస్టు 28 : మండల పరిధిలోని లక్ష్మీతండాలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి, కోట మైసమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మాతృనాయక్, బాజ్జీ, మోతీలాల్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ మడిగెలు, పెట్రోల్ బంకులకు టెండర్లు

నల్లగొండ సిటీ, ఆగస్టు 28 : ఉమ్మడి నల్లగొండ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రధాన రోడ్ల వెంట నిర్మాణానికి సిద్ధంగా ఉన్న షాపులకు ఆన్‌లైన్ విధానంలో టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గురువారం నుంచి సెప్టెంబర్ 11 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా టెండర్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ల ఆవరణలో పెట్రోల్ బంకుల నిర్వహణకు సర్వీస్ ప్రొవైడర్ నియామకానికి ఆన్‌లైన్ విధానంలో టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం తెలిపారు. జిల్లా పరిధిలోని దామరచర్ల, నకిరేకల్, మర్రిగూడ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న స్థలంలో టెండర్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 7382834223 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# రైతు బీమాకు ఎదురుచూపులు

- 2023-24లో చనిపోయిన రైతుల సంఖ్య 780
- ఇప్పటివరకు చెల్లించింది 674 మందికే..
- రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడమే కారణం

## బీమా నగదు చెల్లింపులకు నెల రోజులకు పైనే..

## బీఆర్‌ఎస్ సర్కారులో వారం పది రోజుల్లోనే జమ

**రైతు బీమా చెల్లింపులు సూర్యాపేట జిల్లాలో ఆలస్యమవుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న పది రోజుల్లో రావాల్సిన బీమా నగదు నెల రోజులు సమయం పడుతున్నది. బీమా డబ్బుల కోసం రైతు కుటుంబాలు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా గతేడాది ఆగస్టు 14 నుంచి ఈ సంవత్సరం ఆగస్టు 14 వరకు 780 మంది రైతులు మరణించగా 674 కుటుంబాలకు మాత్రమే బీమా చెల్లింపులు జరిగాయి. ఇంకా 106 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా నుంచి అప్‌లోడ్ చేసిన ఎల్ఐసీలో ఎక్కువ సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ సమస్య వస్తున్నదని తెలుస్తుంది.**

– సూర్యాపేట, ఆగస్టు 28

### నాడు పది రోజుల్లోపే..

రైతు అకాల మరణం ఆ కుటుంబాన్ని ఆర్థిక సంక్షోభంలో నెట్టవద్దనే ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. 2018లో ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకొని రైతుల పేరిట బీమా ప్రీమియం చెల్లించింది. ఎల్ఐసీ నిబంధనల ప్రకారం 18 నుంచి 59 ఏండ్లు నిండిన రైతులకు ఈ పథకం వర్తింపజేశారు. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి వేలాది మంది రైతు కుటుంబాలను కాపాడింది. రైతు మరణిస్తే రూ. 5 లక్షల ఆర్థిక బీమా సహాయం వస్తుండడంతో ఆ కుటుంబం సమాజంలో నిలదొక్కుకునేలా చేసింది. రైతు మరణించిన తర్వాత మరణ ధ్రువీకరణ పత్రంతో స్థానిక ఏఈఓతో దరఖాస్తులు అందిస్తే పది రోజుల్లోపే బీమా వచ్చే విధంగా ప్రభుత్వం పథకాన్ని రూపకల్పన చేసింది. నాటి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ చేయడంతో సరైన సమయానికి బీమా అందింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు బీమా చెల్లింపులు ఆలస్యమవుతూ వస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న తర్వాత నెల రోజులకు కూడా చెల్లింపులు జరుగడం లేదు. దాంతో రైతు కుటుంబాలు వస్తాయా రావా అనే ఆందోళన చెందుతున్నారు. ఎప్పటికప్పుడు అధికారులకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటున్న పరిస్థితి నెలకొంది.

### 1.63 లక్షల మందికి ప్రీమియం

2024–25 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 1,63,598 మంది రైతులకు రైతు బీమా ప్రీమియం చెల్లించారు. ఆగస్టు 14, 1965 నుంచి ఆగస్టు 14, 2006 మధ్య కాలంలో పుట్టి రాష్ట్ర ప్రభుత్వ పట్టాదారు పాస్ పుస్తకం ఉంటే వారికి బీమా వర్తిస్తుంది. 1,51,680 మంది రైతులకు రెన్యూవల్ కాగా 11,918 మంది రైతులు కొత్తగా పాస్ పుస్తకాలతో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రీమియం ఆగస్టు14, 2025 వరకు వర్తించనున్నది.

### పెండింగ్‌లో 106 దరఖాస్తులు

2023– 24 సంవత్సరంలో ఆగస్టు 14 నాటికి జిల్లా వ్యాప్తంగా 780 మంది రైతులు వివిధ కారణాలతో మరణించారు. ఇప్పటి వరకు 674 మంది రైతులకు మాత్రమే బీమా నగదు అందింది. ఇంకా 106 మంది రైతుల బీమా పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక అధికారులు అప్‌లోడ్ చేసినా రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపంతో పెండింగ్‌లో ఉంటున్నాయి. ఎల్ఐసీ సంస్థ వద్దనే పెండింగ్‌లో ఉంటున్నాయని ఇక్కడి అధికారులు చెబుతున్నారు. జిల్లాలో దాదాపు రూ. 5.30 కోట్లు 106 మంది రైతులకు అందాల్సి ఉంది.

### రాష్ట్ర స్థాయిలోనే పెండింగ్‌లో..



గతంలో రైతు మరణించిన తర్వాత వారి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకున్న 10 నుంచి 15 రోజుల్లో రైతు బీమా నగదు పడేది. ఇప్పుడు కొంత ఆలస్యమవుతున్నది. జిల్లాలో క్షేత్ర స్థాయి అధికారులు వారి వద్దకు వచ్చిన వెంటనే దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్నారు. కానీ రాష్ట్ర స్థాయిలో పెండింగ్‌లో ఉంటున్నాయి. 25 రోజుల నుంచి 35 రోజుల సమయం పడుతున్నది. జిల్లాలో గత ప్రీమియానికి సంబంధించి 106 మంది రైతులకు బీమా నగదు రావాల్సి ఉంది. త్వరగా పడేలా చూస్తాం.

**-శ్రీధర్‌రెడ్డి , సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి**



కొలనుపాక జైన దేవాలయం వద్ద గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ అమరేందర్‌రెడ్డి, అధికారులు

## నేడు యాదాద్రి జిల్లాలో గవర్నర్ పర్యటన

భువనగిరి కలెక్టరేట్/ఆలేరురూరల్, ఆగస్టు 28 : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.20 గంటలకు కొలనుపాకలోని జైన దేవాలయాన్ని, సోమేశ్వర ఆలయాన్ని గవర్నర్ దర్శించుకుంటారని, సాయంత్రం 3.30.గంటలకు భువనగిరి పట్టణ సమీపంలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 4.15 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులను, 5.15 గంటలకు కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, ప్రముఖులు, రాష్ట్ర జాతీయ అవార్డు గ్రహీతలను కలుస్తారని తెలిపారు. కొలనుపాకలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను బుధవారం ఆర్డీఓ అమరేందర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, పలు శాఖల అధికారులు పరిశీలించారు.



నాగార్జున సాగర్ డ్యామ్ 18 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

## 18 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నందికొండ, ఆగస్టు 28 : నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద ఉధృతి కొనసాగుతుండడంతో డ్యామ్ 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు.శ్రీశైలం నుంచి 1,94,758 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో డ్యాం క్రస్ట్ గేట్ల ద్వారా 1,45,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాదిలో ఆగస్టు 5న క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల ప్రారంభించి 12 వరకు, మళ్లీ 14 నుంచి 19 వరకు నీటిని విడుదల చేశారు. మూడో సారి ఈ నెల 26వ తేదీన మళ్లీ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించారు. ఇప్పటి వరకు 140 టీఎంసీలను క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. దాంతో పాటు జలవిద్యుత్ కేంద్రాలు, కాల్వల ద్వారా కలిపి మొత్తం 228 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. బుధవారం ఉదయం రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండగా శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో పెరుగడంతో డ్యాం గేట్లను క్రమంగా 18 వరకు పెంచారు.

దాంతో పాటు ఎడమ కాల్వ ద్వారా 8,280 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 9,330 క్యూసెక్కులు, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.50 టీఎంసీలు) కాగా ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిండింది.

## కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విరక్తి

- పథకాలు అమలు చేయడం లేదని మంత్రులను నిలదీస్తున్న పరిస్థితి
- రుణమాఫీ చేయకుండా మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి
- హామీలు అమలు చేయలేకే డైవర్షన్ డ్రామాలు
- కడిగిన ముత్యంలా బెయిల్‌పై వచ్చిన కవితమ్మ
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ, ఆగస్టు 28 : అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విరక్తి పెరిగిందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ విమర్శించారు. కోదాడలోని తన నివాసం బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయడం లేదని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావును ప్రజలు నిలదీశారని గుర్తుచేశారు. ఆగస్టు 15లోగా ప్రతి రైతుకూ 2 లక్షల రుణమాఫీ చేస్తామని నమ్మబలికి సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని మండిపడ్డారు. ఏ గ్రామంలోనూ 35 నుంచి 40 శాతానికి మించి రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎందుకు తెచ్చుకున్నామా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రుణమాఫీ కాని విషయంలో వ్యవసాయ అధికారులు, కలెక్టర్ల వద్ద కూడా స్పష్టమైన సమాచారం లేదన్నారు. హామీలు అమలు చేయలేక బీఆర్‌ఎస్ అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారని, వాటిని మానుకొని ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆయకట్టుకు నీరందక రైతులు అవస్థ పడుతుంటే.. ఇక్కడి నుంచి పోలీస్ పహారాతో మంత్రి తుమ్మల సాగునీటిని తరలించకపోతున్నా జిల్లా మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ పెదవి విప్పలేదని మండిపడ్డారు. హామీలు అమలు చేయలేకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నదని ఆరోపించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య లోపంతో ప్రజలు విషజ్వరాలతో బారిన పడుతున్నారని, ప్రభుత్వ దవాఖానల్లో మందులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. కవితమ్మ బెయిల్‌పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, కాంగ్రెస్ నాయకులు అక్కసుతో చేస్తున్న అపరిపక్వ వ్యాఖ్యలు కోర్టు తీర్పును అపహాస్యం చేసేలా ఉన్నాయన్నారు. కవిత కడిగిన ముత్యంలా బెయిల్‌పై బయటకు వచ్చారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ చిలుకూరు, నడిగూడెం మండలాధ్యక్షులు జానకి రామాచారి, భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు పైడిమర్రి సత్యభామ, పట్టణ అధ్యక్షుడు ఎస్కే నయీమ్, అఫ్జల్, వెంపటి నాగమణి, కట్టికోల వెంకట్, రాంబాబు, మాదాల ఉపేందర్, ఎస్కే అబ్బు, బోసు పాల్గొన్నారు.

## వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ నారాయణరెడ్డి



మిర్యాలగూడ ఏరియా దవాఖానలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 28 : ప్రభుత్వ దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. మిర్యాలగూడలోని ఏరియా దవాఖానను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, చిన్న పిల్లల విభాగం, కంటి విభాగం, ల్యాబ్, కాన్పుల గది, మహిళ, పురుషుల వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు, శానిటరీ, సెక్యూరిటీ సిబ్బంది మాట్లాడారు. దవాఖానను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, రోగులు, వారి బంధువులతో సౌమ్యంగా మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. ఎవరైనా రోగులను డబ్బులను అడిగినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. రోగులకు అందించే భోజనం నాణ్యంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరద్, వైద్యులు, సిబ్బందితో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ డయాలసిస్ విభాగాన్ని మొదటి ఫ్లోర్ నుంచి కిందకు మార్చాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, చికున్ గున్యా వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, ఆర్‌ఎంఓ ప్రజ్ఞారెడ్డి, పౌర సంబంధాల శాఖ ఏడీ, సిబ్బంది పాల్గొన్నారు.



నల్లగొండ కలెక్టరేట్ వద్ద దర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి
- కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

రామగిరి, ఆగస్టు 28 : విద్యా శాఖ పరిధిలోని సమగ్ర శిక్షలో పని చేస్తున్న వివిధ హోదాల ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని తక్షణ అమలు చేయాలని, తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. డీఈఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు గతంలో సమ్మె చేసిన సమయంతోపాటు ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్వీసులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికి దానిపై స్పందన లేదని, చాలీచాలని వేతనాలతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో కీలక భూమిక పోషిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు బేసిక్ పే ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు, ఆరోగ్య బీమా రూ. 5లక్షల సౌకర్యం కల్పించాలని, పీటీఐలకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల మాదిరిగా 12 నెలల వేతనం ఇవ్వాలని, పదవీ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ. 20లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్, సీసీఓ, సీఆర్‌పీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, డీపీఓ, కేజీబీవీ, ఐఈఆర్‌పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

## సంగం డెయిరీ ఎదుట రైతుల ఆందోళన

- వీటీ డెయిరీని వేలంలో కొనుగోలు చేసిన సంగం
- తమ బకాయిలు చెల్లించాకే డెయిరీ ప్రారంభించాలని రైతుల డిమాండ్



సంగం డెయిరీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మిర్యాలగూడ, ఆగస్టు 28: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో గల సంగం డెయిరీ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. ఇక్కడ గతంలో ఉన్న వీటీ డెయిరీ ఎస్‌బీఐ నుంచి రుణం తీసుకుని తీర్చకపోవడంతో బ్యాంకు వారు డెయిరీని వేలం వేయగా, సంగం డెయిరీ యాజమాన్యం కొనుగోలు చేసింది. బుధవారం డెయిరీ ప్రారంభించగా... శ్రీనివాస్‌నగర్ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. వీటీ డెయిరీలో తాము పెట్టుబడులు పెట్టడమే గాక పాలు పోయడం జరిగిందని, ఆ డబ్బులను వీటీ డెయిరీ యాజమాన్యం ఇవ్వలేదని వాపోయారు. ఆ బకాయిలను చెల్లించిన తర్వాతే సంగం డెయిరీ నడపాలని డిమాండ్ చేశారు. గతంలో వీటీ డెయిరీలో 500 మంది వరకు ఉపాధి పొందగా, ప్రస్తుతం సంగం డెయిరీ వారు ఆంధ్రా ప్రాంతం నుంచి వర్కర్లను తీసుకొచ్చిన పనులు చేయిస్తున్నారని, స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కాగా, వీటీ డెయిరీ యజమానులు వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ స్పందిస్తూ.. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం వీటీ డెయిరీ యూనిట్‌తోపాటు భూముల విలువ రూ.25కోట్ల వరకు ఉంటుందని, బ్యాంకు వారు తమకు సమాచారం ఇవ్వకుండా సంగం డెయిరీ వారితో కుమ్మక్కై రూ.11.50కోట్లకే వేలంలో అప్పగించారని ఆరోపించారు. ఈ విషయంపై హైకోర్టులో కేసు నడుస్తున్నదని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం డబ్బు చెల్లించడంతోపాటు రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించిన తర్వాతే డెయిరీని నడపాలని కోరారు.


నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ ప్రజల విశేష ఆదరణ పొందిన ప్రముఖ దిన పత్రిక 'నమస్తే తెలంగాణ' లో పనిచేయుటకు విలేకరులు కావలెను. సామాజిక స్పృహ, అంకితభావంతోపాటు తెలుగు భాషా పరిజ్ఞానం, స్థానిక సమస్యలపట్ల అవగాహన ఉన్నవారు పూర్తి బయోడేటాతో రాత పరీక్షకు హాజరు కాగలరు. జర్నలిజంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది.

**పరీక్ష తేది :**

31-8-2024, శనివారం, ఉ॥ 11 గంటల నుంచి 12 గంటల వరకు

స్థలం: నమస్తే తెలంగాణ టౌన్ ఆఫీస్, L.P.T.మార్కెట్, 1st Floor, Hyd Road, నల్లగొండ

**పని చేయవలసిన డేట్‌లైన్లు:**

నల్లగొండ జిల్లా: దేవరకొండ, చండూరు, వేములపల్లి

యాదాద్రి భువనగిరి జిల్లా : భువనగిరి సిటీ, ఆలేరు టౌన్

సూర్యాపేట జిల్లా : ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, నాగారం, గరిడేపల్లి, తుంగతుర్తి

వివరాలకు 91827 77972